క్లుప్తంగా

పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మొదటి సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 19వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు ఆర్ట్స్, సైన్స్ కోర్సులకు స్కిల్ డెవలప్‌మెంట్ పరీక్ష నిర్వహించారు. ఆర్ట్సు కోర్సుల్లో 339 మందికి 21 ముంది గైర్హాజరయ్యారు. సైన్స్ కోర్సుల్లో 409 మందికి 14 మంది గైర్హాజరయ్యారు. నాలుగేళ్ల సమీకృత విద్యా డిగ్రీ కోర్సుకు సంబంధించి మొదటి, మూడు సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు ఈ నెల 25వ తేదీ వరకు కొనసాగనున్నాయి. పరీక్షలు నిర్వహణను రెక్టార్ అడ్డయ్య, చీఫ్ సూపరింటెండెంట్ లోకేశ్వరి పర్యవేక్షించారు.

వైదిక జీవనమే.. కూర్మగ్రామ విధానం

శ్రీకాకుళం అర్బన్: వైదిక జీవనమే.. కూర్మగ్రామ విధానమని కూర్మ గ్రామానికి చెందిన నటేష్ నరోత్తమ్‌దాస్ అన్నారు. మంగళవారం ఆయన శ్రీకాకుళం వచ్చిన సందర్భంగా మాట్లాడారు. కూర్మగ్రామంలో కరెంటు, స్మార్ట్ ఫోన్లు వాడకుండా, ఆధునిక హంగులకు వెళ్లకుండా జీవించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. పెట్రోల్, డీజిల్ వాడకుండా ఉండేందుకు గుర్రపు బండ్లు, ఎడ్లబండ్ల వాడాలని నిర్ణయించామన్నారు. పెట్రోల్, డీజిల్ కోసం యుద్ధాలు జరగడం, వాతావరణ కాలుష్యం ఏర్పడడం జరుగుతోందన్నారు. ఈ కాలుష్యం వలన కార్బన్ మోనాక్సైడ్ విడుదలై ఊపిరితిత్తుల సమస్యలు, క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. వీటి నుంచి బయటపడి, మరలా పూర్వపు వాతావరణం తీసుకు రావడానికి ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు.

ఘంటసాలకు నివాళి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో గాయకుడు ఘంటసాల వేంకటేశ్వరరావు వర్ధంతి కార్యక్రమాన్ని సీనియర్ గాయకుడు కేఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు గాయకులు గీతాలను ఆలపించారు. అనంతరం శ్రీకాకుళం సెంట్రల్ లైన్స్ క్లబ్ మెంటార్ నటుకుల మోహన్ మాట్లాడుతూ.. ఈనెల 14న ఘంటసాల ది గ్రేట్ చిత్రం విడుదల చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో వీక్షించాలని కోరారు. అనంతరం చిత్రం వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సాయిబాబా, మార్గదర్శి శ్రీను, న్యాయవాది కూన రాజారావు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన నష్ట పరిహారం

శ్రీకాకుళం పాతబస్టాండ్: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు తక్షణమే నష్ట పరిహారం అందించాలని స్కీమ్ కన్వీనర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో హిట్ అండ్ రన్ బాధితులకు త్వరితగతిన నష్టపరిహారం అందించే విధానాలపై విస్తృతంగా చర్చ జరిపారు. నష్ట పరిహారం ప్రక్రియను సరళీకరించే మార్గాలపై అధికారులతో మాట్లాడారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి, డీఎస్పీ డి.ప్రసాద్, ఆర్డీవో ఆఫీస్ ఏవో ఈశ్వరమ్మ, రాజాం ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేగవంతంగా పూర్తి చేయాలి

గార: మండల కేంద్రమైన గార పంచాయతీలో పల్లె పండగ రోడ్లు వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. కుమ్మరిపేట, కర్మాలపేట తదితర గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి పనులు జరగనున్న ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గార పెద్దచెరువు నీరు పొలాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. ఆయనతో పాటు బడగల వెంకటప్పారావు, పీస రమణ, కొంక్యాన రమణ తదితరులున్నారు.

ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ గణపతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటి వీధిలో వేంచేసిన లక్ష్మీ గణపతి ఆలయ 13వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. షిరిడి సాయి సేవా సంఘం ఆధ్వర్యంలో అర్చకులు వేదమంత్రాలతో స్వామివారికి క్షీరాభిషేకాలు నిర్వహించారు. గణపతి హోమం, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యూరియా.. ఏదయా..?

- వేధిస్తున్న యూరియా కొరత
- ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలు
- లబోదిబోమంటున్న అన్నదాత

ప్రస్తుతం రబీలో సాగవుతున్న పంటలు

పంట	హెక్టార్లు
వరి	175.2
మొక్కజొన్న	1090
రాగి	395.2
మినుములు	446.8
వేరుశనగ	4.6
పెసర	473.2
మిరప	59.6
చెరుకు	4.3
వివిధ రకాల పంటలు	44.5


రామచంద్రాపురంలో సాగవుతున్న మొక్కజొన్న

గార: అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా కేంద్రాల పేరును రైతుసేవా కేంద్రాలుగా కూటమి ప్రభుత్వం మార్పు చేసింది. కానీ రైతులకు సేవలందించడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తోంది. ఒకపక్క అన్నదాత సుఖీభవ పథకం ఊసెత్తని నాయకులు, మరోవైపు రబీకి ఎరువుల నిల్వలు లేకపోయినా కనీసం స్పందించడం లేదు. సాక్షాత్తు జిల్లాకు చెందిన కింజరాపు అచ్చెన్నాయుడే వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ, రైతులకు సకాలంలో ఎరువులు అందడం లేదని వాపోతున్నారు.

గార మండలంలో...

గార మండలంలో ఈ ఏడాది రబీ విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. అధికంగా మొక్కజొన్న, తర్వాత స్థానంలో వరిపంట ఉంది. మొత్తంగా 2,684 హెక్టార్లలో రబీ కాలంలో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. వీటికి నీరు పెట్టే సమయంలో ఎరువు అవసరం కాగా, ఈ పరిస్థితుల్లో యూరియా అందుబాటులో లేకుండా పోయింది. ఇదే సమయంలో ప్రైవేటు వ్యక్తుల వద్ద మాత్రం లభ్యమవుతోంది. దీంతో యూరియాకు డిమాండ్ చూపి అధిక రేట్లు వసూలు చేస్తున్నారు. మండలంలో మొత్తం రైతుసేవా కేంద్రాలు 24 వరకు ఉన్నా, ఏ ఒక్క కేంద్రంలోనూ ఒక బస్తా కూడా యూరియా లేని పరిస్థితి ఉంది.


గార గ్రామంలో సాగుచేస్తున్న వరిపంట

ప్రైవేటు దుకాణాల ఇష్టారాజ్యం

వాస్తవానికి ప్రభుత్వం యూరియా బస్తాను రూ.275లకు రైతుకు నేరుగా అందిస్తోంది. అయితే ప్రస్తుతం నిల్వలు లేకపోవడంతో డిమాండ్ దృష్ట్యా మండల ఎరువుల డీలర్లు మాత్రం ప్రైవేటు కంపెనీ జింక్ కొనుగోలుతో పాటు బస్తాకు రూ.350లు వరకు వసూలు చేస్తున్నారు. జింక్ ప్యాకెట్ ధర సుమారు రూ.200లు నుంచి రూ.250లు వరకు ఉంటుంది. దీంతో జింక్ అవసరం లేకున్నా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి కల్పిస్తున్నారు. ఒకవేళ జింక్ కొనుగోలు చేయకుంటే యూరియా బస్తా రూ.400లు చెబుతున్నారని పలువురు రైతులు బహిరంగంగానే చెబుతున్నారు.

పట్టించుకోని అధికారులు

గతంలో వచ్చిన యూరియా బస్తాలను కూటమి పార్టీలకు చెందిన నాయకులు పదుల సంఖ్యలో ఇళ్లకు తరలించుకున్నారు. దీంతో సామాన్యుడికి అందని పరిస్థితిని తీసుకొచ్చారు. మండలంలోని అంపోలు, తూలుగు పీఏసీఎస్‌లు, ఒక డీసీఎంఎస్‌లు ఉన్నా యూరియా పంపిణీ లేదు. ఇలాంటి పరిస్థితుల్లో దృష్టి సారించాల్సిన వ్యవసాయ శాఖ, విజిలెన్సు, మండల ఉన్నతాధికారులు అన్నదాత ఆవేదనను పట్టించుకోవడం లేదు. యూరియా కొరతపై ఏవో దుంపల పద్మావతి వద్ద ప్రస్తావించగా.. యూరియా కొరత వాస్తవమేనని, వ్యాగన్ రేపటికి వస్తుందని సమాచారం ఉందన్నారు. పూసర్లపాడు, కొర్ని, కొర్లాం రైతుసేవ కేంద్రాల్లో రెండు రోజుల్లో అందుబాటులో ఉంటుందన్నారు. అధిక ధరలపై దృష్టి సారిస్తామని, ప్రభుత్వం నిర్దేశించిన ధరల్లో మాత్రమే అమ్మాలని ఇప్పటికే ప్రైవేటు డీలర్లకు స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు.



యూరియాతో పాటు అమ్ముతున్న జింక్ ప్యాకెట్ ఇదే...

స్పందన లేదు



ప్రస్తుతం మిరప, మొక్కజొన్న పంటలు వేశాను. గత వరి పంటల సమయం నుంచే యూరియా పూర్తిస్థాయిలో దొరకడం లేదు. ఇటీవల వచ్చినా పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వం, అధికారుల నుంచి పెద్దగా స్పందన లేదు. ప్రైవేటు వర్తకుల వద్ద మాత్రం యూరియా దొరుకుతోంది.

– మళ్ల చిట్టిబాబు, బూరవిల్లి, గార మండలం

అవస్థలు తప్పడం లేదు



రైతుసేవా కేంద్రాల వద్ద యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. స్టాకు ఎప్పుడు వస్తుందోనని ఎదురు చూస్తున్నారు. మిగతా ఎరువుల కంటే యూరియా కోసం ఎక్కువ ఇబ్బందులు పడుతున్నారు. కొరతపై గత మండల సమావేశాల్లో కూడా అడిగాం. అధికారులు దృష్టి సారించి అధిక ధరలకు కళ్లెం వేయాలి.

– మార్పు ఆదినారాయణ, సర్పంచ్, కె.సైరిగాం

దొరకడం లేదు



యూరియా కొరతపై వాడాడ రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రైవేటు వర్తకుల వద్దకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. నీరు పెట్టేటప్పుడే వేయాల్సిన యూరియా అవసరం మేరకు దొరకడం లేదు. దీనిపై మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకపోయింది. విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ సెలవు కారణంగా వాడాడకు యూరియా ఇవ్వలేమని మండల వ్యవసాయాధికారి చెప్తుండడం బాధాకరం.

– సుంకాన సురేష్, వాడాడ సర్పంచ్,

కూటమి వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్


పార్టీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: వైఎస్సార్‌సీపీ నాయకులు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఇటీవల నియామకమైన పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా నియామకమైనవారు పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. కూటమి అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా సంక్షేమ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తోందని దుయ్యబట్టారు. ప్రజల పక్షాన నిరంతరం నిలవడమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, జిల్లా ఉపాధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి అంబటి రాంబాబు, సంస్కృతీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎ.నారాయణరెడ్డి, జెడ్పీటీసీలు కాయల రమణ, మీసాల సీతం నాయుడు, మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, మీసాల వెంకటరమణ, వైస్ ఎంపీపీలు రాయపురెడ్డి భుజంగరావు, బెండు రామారావు, మండల పార్టీ అధ్యక్షులు దన్నాన రాజీనాయుడు, గొర్లె శ్రీనివాసరావు, డోల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నిద్దాలమ్మ జాతర


ముర్రాటలతో బారులుతీరిన భక్తులు

జి సిగడాం: మండలంలోని నిద్దాం గ్రామంలో వెలిసిన నిద్దాలమ్మ తల్లి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా మంగళవారం ముగిశాయి. యాత్రకు వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారికి ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ వై.మధుసూదనరావు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న కమిషనర్ ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని అక్రమ నిర్మాణాలపై అధికారులు దృష్టి సారించాలని కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాద్ స్పష్టం చేశారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ప్లానింగ్ విభాగం అధికారులతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణదారులకు నోటీసులు ఇవ్వడంతో పాటు విద్యుత్ కనెక్షన్ లేకుండా చేయాలన్నారు. కార్పొరేషన్ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వ్యాపార ప్రకటన బోర్డులు చాలాచోట్ల విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్నా, నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. సక్రమంగా విధులు నిర్వహించకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏసీపీ వేంకటేశ్వరరావు, టీపీవో ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు


పూజలందుకుంటున్న ముత్యాలమ్మ

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక కాకివీధిలో ఉన్న ముత్యాలమ్మ తల్లి ఆలయ పదో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దమ్మల పూజారుల ఆధ్వర్యంలో అమ్మవారి నిజరూప దర్శనం జరిగింది. పాలు, పంచామృతాలతో అభిషేకాలు, భక్తులు పసుపు, కుంకుమలతో ముర్రాటలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు.

నేడు శ్వేతగిరిపై వేణుగోపాల స్వామి కల్యాణోత్సవం

గార: శాలిహుండం కొండపైనున్న కాళీయ మర్దన వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం స్వామి కల్యాణోత్సవం జరగనుందని ఆలయ అనువంశిక ధర్మకర్త సుగ్గు మధురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మాఘ శుద్ధ పౌర్ణమి సమయంలో శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, లక్ష్మీ, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు జరుగుతాయని అర్చకులు తెలిపారు. భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొనాలని కోరారు.

సిరిజ్యోతి పూజలు


శ్రీచక్ర సిరిజ్యోతి పూజలు చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలో ఉన్న బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా శ్రీచక్రరూపేన సిరిజ్యోతి పూజలు మంగళవారం జరిగాయి. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో మహిళలు శ్రీచక్రానికి దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ రజని తదితరులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మంగళవారం దాసరి ఆళ్వార స్వామి రాసిన 'పాత్రికేయ రంగంలో నా అనుభవాలు' పుస్తకాన్ని వీసీ కె.ఆర్.రజిని మంగళవారం ఆవిష్కరించారు. జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో గ్రంథాలయానికి పుస్తకాలను రచయిత అందజేశారు. కార్యక్రమంలో రెక్టార్ అడ్డయ్య, రిజిస్ట్రార్ సుజాత పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

గార: మండలంలోని వమరవల్లి బాలికల గురుకుల పాఠశాల, డైట్ కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని శ్రీకాకుళం ఒకటో పట్టణ సీఐ పైడపునాయుడు సూచించారు. మంగళవారం మధ్యాహ్నం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదవితే అనుకున్న లక్ష్యాలు చేరుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆర్.జనార్దన్ పాల్గొన్నారు.

మర్యాదపూర్వక భేటీ



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విజయనగరం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకుడు పిన్నింటి సాయికుమార్ మర్యాదపూర్వకంగా తాడేపల్లిగూడెంలో మంగళవారం కలిశారు. ఆయనతో పాటు రణస్థలం జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, జేసీఎస్ కన్వీనర్ చిల్ల వెంకటరెడ్డి, జి.సిగడాం మండల కన్వీనర్ ఆబోతుల జగన్నాథం ఉన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, కార్యకర్తలకు అండగా నిలవాలని జగన్ చెప్పినట్లు సాయికుమార్ తెలియజేశారు. – రణస్థలం

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని డిమాండ్


అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి ఇస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కె.కల్యాణి, డి.సుధ డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని 80అడుగుల రోడ్డులోగల ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో గల నోడల్ అధికారి పి.మణమ్మను అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు కలిసి అంగన్‌వాడీల డిమాండ్‌లు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీలకు గ్రాడ్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్‌లను మెయిన్ సెంటర్‌లుగా మార్చుతూ జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సర్వీసులో ఉండి చనిపోయిన వారికి దహన సంస్కారాల ఖర్చుల కోసం రూ.20వేలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న సెంటర్ అద్దెలు, టీఏ బిల్లులు వెంటనే ఇవ్వాలన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై సెమినార్


ప్రసంగిస్తున్న బీఆర్ఏయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ రంగనాథ్

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని జిల్లాకేంద్ర గ్రంథాలయంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌పై మంగళవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఏయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.సంతోష్ రంగనాథ్ మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో కొన్ని మంచి కేటాయింపులతో పాటు లోటుపాట్లు సైతం ఉన్నాయన్నారు. బడ్జెట్ పూర్తి స్వరూపం చర్చకి రావడం మంచిదని పేర్కొన్నారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కేతవరపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్రం బడ్జెట్‌లో పేదలను విస్మరించి, కార్పొరేట్లకు పెద్దపీట వేసిందని విమర్శించారు. అంతకుముందు గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం వ్యవస్థాపకుడు వీజీకే మూర్తికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శి ఎం.ప్రభాకరరావు, సహ కార్యదర్శి పి.సుధాకర్, కోశారి రామకృష్ణ, మెడికల్ రిప్రెజెంటేటివ్ నాయకుడు సతీష్, సీఐటీయూ జిల్లా నాయకుడు తేజేశ్వరరావు, పోస్టల్ ఉద్యోగ సంఘ నాయకుడు గణపతి, ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు, మహిళా సంఘాల నాయకురాలు నాగమణి, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, పెన్షనర్లు, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

సత్తాచాటిన వ్యాయామోపాధ్యాయులు


మెడల్స్ సాధించిన ఉపాధ్యాయులతో డీఈవో తిరుమల చైతన్య తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి పీడీ, పీఈటీల సెమినార్, స్పోర్ట్స్ మీట్‌లో శ్రీకాకుళం జిల్లా వ్యాయామోపాధ్యాయులు సత్తాచాటారు. కాకినాడ వేదికగా ఈనెల 8 నుంచి 10 వరకు జరిగిన ఈ సెమినార్ కమ్ స్పోర్ట్స్ మీట్‌లో ఛాంపియన్‌గా నిలిచి జిల్లాకు గర్వకారణంగా నిలిచారని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య పేర్కొన్నారు. మంగళవారం డీఈవో కార్యాలయంలోని తన ఛాంబర్‌లో పీడీ, పీఈటీలను అభినందించారు. ఈ పోటీల్లో జిల్లా జట్టు హ్యాండ్‌బాల్‌లో విన్నర్ నిలిచింది. అలాగే షటిల్ బ్యాడ్మింటన్‌లో బి.లక్ష్మణరావు, సీహెచ్ పద్మలోచన, షేక్ మహ్మద్ మున్నా, అథ్లెటిక్స్‌లో డి.యశోద, జీఎం జ్యోతిరాణి, టి.ఆనంద్‌రావులు విజయబావుటా ఎగురవేయడంతో సత్కరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, మెట్ట తిరుపతిరావు, జి.రాజశేఖర్, బి.నిర్మల్‌కృష్ణ, ఆర్.సతీష్‌రాయుడు, హరీష్‌రాయుడు, డి.ఈశ్వరరావు, ఆనంద్, జ్యోతిరాణి, యశోద, లక్ష్మణరావు, పద్మలోచన, మున్నా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నాటిక పోటీలు


దేవరాగం నాటిక దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళా మందిర్‌లో ముత్యాలమ్మ కళానికేతన్, పీకే ఎంటర్‌టైన్‌మెంట్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు మంగళవారంతో ముగిశాయి. విశాఖకు చెందిన తెలుగు కళా సమితి ఆధ్వర్యంలో చలసాని కృష్ణప్రసాద్ దర్శకత్వంలో 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత' నాటిక ప్రదర్శన చక్కగా సాగింది. అనంతరం ఉత్తరాంధ్ర, సౌజన్య కళా స్రవంతి ఆధ్వర్యంలో కేకేఎల్ స్వామి దర్శకత్వంలో 'దేవరాగం' నాటిక ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో సురంగి మోహనరావు, పన్నాల నర్సింహమూర్తి, ఢిల్లీశ్వరరావు, కేశిరెడ్డి రాజేశ్వరి, ఎల్.రామలింగస్వామి, బీఏ మోహనరావు, నిక్కు అప్పన్న, జ్యోతి, రామచంద్రదేవ్, సత్యవతి, కీర్తి, ప్రతాప్, సత్యనారాయణ, నిక్కు హరిసత్యనారాయణ, అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక అంశాలపై పట్టు అవసరం


విద్యార్థుల ప్రయోగాలు పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అమరేంద్ర

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ విద్యార్థులకు సాంకేతిక అంశాలపై పట్టు అవసరమని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అమరేంద్ర అన్నారు. నూజివీడులోని శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ ఇంజినీరింగ్ క్యాంపస్‌లో మంగళవారం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ డిపార్టమెంట్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహించనున్న స్టూడెంట్ డవలప్‌మెంట్ ప్రోగ్రాం 'రోబోటిక్స్ ఫర్ అటానమస్ నావిగేషన్' కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఏఐ వంటి సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తోందన్నారు. విద్యార్థులు కొత్త విషయాలు తెలుసుకోవడంతో పాటు నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. కార్యక్రమం కో–ఆర్డినేటర్లుగా ఎం.రాము, ఎస్‌కే రియాజ్ హుస్సేన్ వ్యవహరిస్తున్నారు.

బెస్ట్ ఆర్ట్ డైరెక్టర్‌గా నాగేశ్వరరావు


అవార్డు అందుకుంటున్న మణిపాత్రుని నాగేశ్వరరావు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణానికి చెందిన మణిపాత్రుని నాగేశ్వరరావు ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్–25లో బెస్టు ఆర్ట్ డైరెక్టర్‌గా అవార్డును అందుకున్నారు. సౌత్ మీడియా మోడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో ఈ అవార్డును అందజేశారు. పద్మశ్రీ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేసినందుకు ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో వేణుగోపాలాచారి, రేలంగి నరసింహారావు, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, మీనుసింగ్, ఆధ్యాత్మికవేత్త రాధా మోహన్‌దాస్, ఎస్ఎస్ పట్నాయక్‌లు పాల్గొన్నారు.

11సిటివో51: పూజలందుకుంటున్న ముత్యాలమ్మ